క్లుప్తంగా

సరుకులు పక్కదారి పడితే చర్యలు

సీడీపీఓ శ్రీలక్ష్మి



అంగన్‌వాడీ సెంటర్‌లో సరుకులు పరిశీలిస్తున్న సీడీపీఓ శ్రీలక్ష్మి

తాండూరు రూరల్: అంగన్‌వాడీ సెంటర్‌లో సరుకులు పక్కదారి పడితే చర్యలు తప్పవని సీడీపీఓ శ్రీలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం పెద్దేముల్ మండలంలోని చైతన్యనగర్ గ్రామంతో పాటు పలు గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ..వేసవి కాలం దృష్ట్యా అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కలెక్టర్ ప్రత్యేక నిధులతో సెంటర్లలో అన్నీ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. వంట సామగ్రి, వంట పాత్రలతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. తాండూరులోని అంగన్‌వాడీ సెంటర్లను మోడల్ సెంటర్లుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు

తాండూరు: తాండూరు పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి విదేశాలకు వెళ్లడంతో దీనికి హాజరు కాలేదని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. ఇఫ్తార్ విందుకు ముస్లిం మత పెద్దలు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు హాజరయ్యారు.

తప్పులను సరిచేయించుకోండి

తహసీల్దార్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న తహసీల్దార్

కొడంగల్: ఓటరు లిస్టులో ఏమైనా తప్పులు ఉంటే సరిచేయించుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సిద్ధం కావాలని సూచించారు. ప్రతి పార్టీ నుంచి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఓటరు లిస్టులో తప్పులు ఉంటే బూత్ లెవల్ అధికారులకు చెప్పి సరి చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు పట్టణ మాజీ సర్పంచు రమేష్‌బాబు, సీపీఐ నాయకుడు సిరుసని శ్యాంసుందర్, ఎమ్ఐఎమ్ తాలూకా అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్, కాంగ్రెస్ నాయకుడు ఆసీఫ్ ఖాన్, టీడీపీ నాయకుడు శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణ



ఢిల్లీలో జంతర్‌మంతర్ ముట్టడికి వెళ్లిన కాంగ్రెస్ నేతలు

పరిగి: కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పరిగి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలకు నిససనగా జాతీయ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడికి వెళ్తుండగా జంతర్ మంతర్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికి కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నాగవర్ధన్, గండీడ్ మండల అధ్యక్షుడు సాయితేజ్, పరిగి మండల ఉపాధ్యక్షుడు వివేక్‌గౌతమ్ పాల్గొన్నారు.

కరన్‌కోట్‌లో రేషన్ పరేషాన్!

- 2,137 కార్డులకు ఒకటే దుకాణం
- షాపుల సంఖ్య పెంచాలంటున్న గ్రామస్తులు
- ఎమ్మెల్యే ఆదేశించినా స్పందించని రెవెన్యూ అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు



కరన్‌కోట్‌లో రేషన్ బియ్యం కోసం వచ్చిన లబ్ధిదారులు

తాండూరు రూరల్: కరన్‌కోట్ జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీ. దాదాపు 10వేల మంది నివాసముంటున్నారు. గ్రామం చుట్టుపక్కల నాపరాతి గనులు, సిమెంట్ ఫ్యాక్టరీలు ఉండటంతో వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులు వలసొచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. గ్రామస్తులు ముఖ్యంగా వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఈ గ్రామంలో 2,137 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 172 అంత్యోదయ కార్డులు కూడా ఉన్నాయి. ప్రతీనెల 400 క్వింటాళ్ల రేషన్ బియ్యం కోటా వస్తోంది. ప్రతీనెల మొదటి వారం నుంచే లబ్ధిదారులకు రేషన్ సరుకులు అ సరఫరా చేస్తున్నారు. అయితే ఎక్కువ సంఖ్యలో ఇక్కడ రేషన్‌కార్డులు ఉండడంతో బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీ పనులు మానుకొని బియ్యం కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇది మేజర్ గ్రామం కావడంతో సీసీఐ కాలనీ, జయశంకర్ కాలనీ, కోటా నుంచి ఆటో, బైక్, సైకిళ్ల ద్వారా బియ్యం తీసుకెళ్లడానికి లబ్ధిదారులు వస్తుంటారు. ఆయా కాలనీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తే వారికి కొంత సౌకర్యవంతంగా ఉంటుందని చెబుతున్నారు.

దుకాణాల సంఖ్య పెంచాలని వేడుకోలు

జిల్లాలోనే మేజర్ గ్రామం కావడంతో సుమారు 10వేల జనాభా ఉంది. 2,137 రేషన్‌కార్డులకు ఒకటే రేషన్ దుకాణం ఏర్పాటు చేశారు. కాబట్టి దుకాణాల సంఖ్య పెంచాలని ఇటీవల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మనోహరెడ్డి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్‌లను గ్రామస్తులు కోరారు. కొత్త దుకాణం ఏర్పాటు చేసి డీలర్లను నియమిస్తామని అధికారులు చెప్పారు. అయినప్పటికీ నేటికి రేషన్ దుకాణాల సంఖ్య పెంచలేదు. ఈ గ్రామంలో ఏర్పాటు చేయలేదు.

సక్రమంగానే బియ్యం పంపిణీ

కొన్ని సంవత్సరాల నుంచి కరన్‌కోట్ గ్రామంలో రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేస్తున్నామని డీలర్ రెడ్డి మన్నెప్ప తెలిపారు. 2,137 రేషన్ కార్డులు ఉన్నాయని, ఇందులో 500 కార్డులు వివిధ ప్రాంతాల్లో బయటనే లబ్ధిదారులు బియ్యం తీసుకుంటున్నారన్నారు. రేషన్‌కార్డులు ఎక్కువగా ఉండటంతో ముగ్గురు సిబ్బందితో దుకాణం నడిపిస్తున్నానని చెప్పారు.

> **“ఎలాంటి దరఖాస్తు రాలేదు**
>
> 
>
> కరన్‌కోట్‌లో నూతన రేషన్ దుకాణాల ఏర్పాటునకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయానికి ఎలాంటి దరఖాస్తు రాలేదు. గతంలో ఓ రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. దానికి సంబంధించి ఎలాంటి ఆడర్ కాఫీ కార్యాలయానికి చేరలేదు. నేను వచ్చి ఏడాదవుతుంది. నాకు ఎవరూ అదనంగా రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని కోరలేదు. గ్రామ ప్రజలు ఫిర్యాదు చేస్తే కలెక్టర్‌కు పంపిస్తా.
>
> – తారాసింగ్, తహసీల్దార్, తాండూరు

డిగ్రీకళాశాల ఏర్పాటు చేయాలని వినతి



రాములుయాదవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానిక నాయకులు, యువకులు

మర్పల్లి: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు గూడెం రాములు యాదవ్‌కు మర్పల్లి యువకులు మంగళవారం గ్రామపంచాయతీ వద్ద వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మర్పల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాలు చేయిస్తామని ఎన్నికల సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ యువతకు హామీ ఇచ్చిన విషయాన్ని రాములుయాదవ్ గుర్తు చేశారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అదేవిధంగా గతంలో ఎప్పుడు లేని విధంగా మర్పల్లి జీపీలో రూ. కోటితో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు ఆయన గర్తు చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వీరేశం, రజినీకాంత్, నగేశ్, బంతి, ప్రవీణ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్, కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, స్థానిక నాయకులు గణేష్, శివ, నర్సింలు యాదవ్, రంగారెడ్డి, వినోద్‌శర్మ, మారుతి తదితరులు ఉన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

- ఎంపీడీఓ రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి
- ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం



ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

కుల్కచర్ల: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని ఎంపీడీఓ రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో సయోధ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణను అందించి వారి జీవనోపాధికి స్వచ్ఛంద సంస్థలు కృషిచేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, ఏపీఎం శోభ, కుల్కచర్ల మాజీ ఎంపీటీసీ ఆనందం, సంస్థ కోఆర్డినేటర్ శివాజీ, వెంకట్రాములు, శివానందం, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వీధినాటకాలను ప్రోత్సహించాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్



నిర్వాహకులకు ఆర్థిక సాయం అందజేస్తున్న అశోక్‌కుమార్ తదితరులు

కుల్కచర్ల: వీధినాటకాలను ప్రోత్సహించాలని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం అర్ధరాత్రి చౌడాపూర్ మండలం లింగంపల్లి గ్రామపంచాయతీలో మల్లికార్జున స్వామి వీధినాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్ర, దేవాతామూర్తుల గాధలను ఒక దృశ్యరూపకంగా, ప్రత్యక్షంగా నటిస్తూ, కథను వివరిస్తూ ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నేటికాలంలోనూ వీధినాటకాలు ప్రదర్శించడం సంతోషకరమన్నారు. లింగంపల్లిలో నిర్వహిస్తున్న వీధినాటకానికిగాను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి రూ.25వేల ఆర్థిక సహాయం పంపించారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, టీఆర్ఆర్ యువసేన మండల అధ్యక్షుడు శ్రీశైలం, స్థానిక నాయకులు కృష్ణయ్య, రాములు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఎంఈఓ హరిలాల్



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ హరిలాల్

బొంరాస్‌పేట: అన్ని పాఠశాలల్లో విద్యార్థుల మార్కుల జాబితాను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈఓ హరిలాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని భోజన్నగడ్డతండా పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎఫ్ఏ3, ఎస్ఏ1, అపార్ ఐడీ జనరేట్ చేయించుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, సీఎల్ అకౌంట్స్, ప్రతినెల చివరి పనిదినాన్ని మండల విద్యా వనరుల కేంద్రంలో సమర్పించాలన్నారు. ఇందులో హెచ్ఎం విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అపార్ పెండింగ్ అందజేయాలి..

మండంలలోని అపార్ వివరాలు నమోదు చేయడంలో ఇంకా ఎనిమిది పాఠశాలలు సమర్పించలేదని ఎంఈఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ బొంరాస్‌పేట, ఎంపీ యూపీఎస్‌లు వడిచర్ల, కొత్తూరు, మదనపల్లి, ఎంపీపీఎస్‌లు రేగడిమైలారం, ఏనెమీదితండా, ఊరెనికితండా, మండలంలోని దళితవాడ పాఠశాలల సిబ్బంది ఇప్పటి వరకు అపార్ వివరాలు ఆన్‌లైన్ లేదా ఎమ్మార్సీలో సమర్పించలేదని వెంటనే నమోదు చేయించుకోవాలన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర



పూజలో సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ధన్నారంలో వెలసిన ఎల్లమ్మ తల్లి జాతర మంగళవారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవంలో వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి



తాండూరు రూరల్: సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి తదితరులు



బొంరాస్‌పేట: సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: గ్రామాల అభివృద్ధే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి లక్ష్యమని కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం చైతన్యనగర్ గ్రామంలో మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.10లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ..ఎమ్మెల్యే చొరవతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంజిలయ్య, బిచ్చప్ప, అశోక్‌రెడ్డి, మైపూఫ్, వెంకటయ్య పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజా పాలనలో సీసీరోడ్లతో వీధులన్నీ శుభ్రం కానున్నాయని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దాసరి చంద్రప్ప పేర్కొన్నారు. మంగళవారం రేగడిమైలారంలో సీఆర్ఆర్ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రాపంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామ అధ్యక్షుడు గుండప్ప, మాజీ వార్డు సభ్యుడు వీరప్ప, రాజుగౌడ్, సాయిలు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: సీసీ రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని పంచాయతీ రాజ్ ఈఈ ఉమేశ్‌కుమార్ సూచించారు. దొంగ ఎన్కేపల్లి, ఐనాపూర్ గ్రామాలలో మాజీ సర్పంచులు అశోక్‌రెడ్డి, మల్లేశ్‌తో కలిసి సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాలలో వేస్తున్న సీసీ రోడ్లలో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించడం లేదని తన దృష్టికి వచ్చిందని, క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్లకు ఒక క్యూబిక్ మీటర్ చొప్పున ఆరు బస్తాల సిమెంట్‌ను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. రోడ్డు పనుల్లో నాణ్యత లోపించినట్లు తెలిస్తే బిల్లులు నిలిపేస్తామని ఉమేశ్ కుమార్ హెచ్చరించారు.

విద్యా కమిషన్ సలహాదారు వెంకట్‌రెడ్డికి సన్మానం



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ మధులత తదితరులు

తాండూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారు ఆర్ వెంకట్‌రెడ్డిని పలువురు సన్మానించారు. మంగళవారం తాండూరులో నిర్వహించిన క్వాలిటీ ఎడ్యుకేషన్, టీచర్స్ ఇంటరాక్టివ్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. బాధ్యతలు చేపట్టి మొదటిసారి తాండూరుకు వచ్చిన వెంకట్‌రెడ్డిని పెద్దేముల్ మండల మాజీ వైస్ ఎంపీపీ మధులత శ్రీనివాస్‌చారి, కవయిత్రి మొల్ల కళా వేదిక ఫౌండర్ అధ్యక్షుడు మంబాపూర్ వెంకట్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జనార్ధన్‌రెడ్డి శాలువకప్పి పూల మాల వేసి సన్మానించారు.

దుద్యాల్‌లో హెచ్‌ఐవీ పరీక్షలు



హెచ్ఐవి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దుద్యాల్: మండల పరిషత్ కార్యాలయం ఎదుట వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. తాండూర్ ప్రభుత్వ ఆస్పతికి చెందిన సిబ్బంది హిందు, జ్యోతిల ఆధ్వర్యంలో హెచ్ఐవి పరీక్షలు సాగాయి. గ్రామానికి చెందిన 96 మందికి పరీక్షలు నిర్వహించారు. వారెవ్వరికీ కూడా హెచ్ఐవీ సోకలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యా, ఆశ కార్యకర్త స్వాతి, సత్యనారాయణ, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మేరుగు వెంకటయ్య, మాజీ సర్పంచ్ ఖాజా, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ ఖలీల్ పాషా, గ్రామస్తులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వద్దు

ఎంఈవో విజయరామారావు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈవో విజయరామారావు

దుద్యాల్: మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఎంఈవో విజయరామా రావు పేర్కొన్నారు. కుదురుమల్ల ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విధిగా సరైన సమయానికి హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నిరంజన్ రెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లపై లాఠీచార్జి బాధాకరం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ



పరిగి: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు

పరిగి: ఆశా వర్కర్లపై లాఠీచార్జి చేయడం బాధాకరమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ నెల 24న చలో కమిషనరేట్ కార్యక్రమాన్ని తలపెట్టిన ఆశావర్కర్ల నిరసనను భగ్నం చేసి పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ అరెస్టులను తప్పించుకుని హైదరాబాద్ వెళ్తున్న వారిపై లాఠీచార్జ్ చేయడంతో దీనికి నిరసనగా మంగళవారం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పరిష్కరించాలన్నారు. అధికారంలోకి వచ్చాక ఇష్టానుసారంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి మంగమ్మ, పద్మమ్మ, నర్సమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి..

కుల్కచర్ల: ఆశ కార్యకర్తలపై చిన్నచూపుచూడటం తగదని సంఘం సభ్యులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా తాము ప్రజలకు సేవ చేస్తున్న ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తల సంఘం సభ్యులు యాదమ్మ, సునీత, పద్మ, పి.యాదమ్మ, మంజుల, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని జిల్లా ఆశావర్కర్ల సంఘం అధ్యక్షురాలు మాధవి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ దోమ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్రంలో పాలన గాడి తప్పిందన్నారు. అధికారంలోకి రాకముందు ఒకమాట, వచ్చాక మరో మాట కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంగమ్మ, మండల ఆశవర్కర్లు అతియాబేగం, పద్మమ్మ, యాదమ్మ, అనసూయ, చిట్టెమ్మ, సుజాత, నర్సమ్మ, లక్ష్మి, రమాదేవి, బుడ్డమ్మ, యశోద, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

❖ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి

దౌల్తాబాద్: ఎల్ఆర్ఎస్ కింద ఈ నెల 31లోగా ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. అనధికారి లేఅవుట్ స్థలాల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎ)కు ప్రభుత్వం కల్పించిన 25శాతం రాయితీ గడువు ఈ నెల 31తో ముగుస్తుందని తెలిపారు. కావున దీన్ని సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో 92 దరఖాస్తులు వచ్చాయని పంచాయతీ కార్యదర్శి గోపాల్ తెలిపారు.

❖ స్కూల్ బ్యాగుల పంపిణీ

తాండూరు రూరల్: అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ తరుపున ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని కంపెనీ ప్రతినిధి నాగార్జున పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిట్టిఘనాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 40 స్కూల్ బ్యాగులు, బూట్లు, ట్రాక్ సూట్స్ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రమోద్, పంచాయతీ కార్యదర్శి శిరీష, అంగన్‌వాడీ టీచర్ భార్గవి, నాయకులు పటేల్ విజయ్‌కుమార్, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

❖ పంటల పరిశీలన



దుద్యాల్: మండలంలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు మామిడి, వరి పంటలు దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా మంగళవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. దుద్యాల్, అల్లిఖాన్‌పల్లి, చిలుముల మైల్వార్ గ్రామంలో అధికంగా పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. పంట నష్టం వివరాలను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. కుదురుమల్ల గ్రామంలో ఏఈవో జ్యోతి రాలిపోయిన వరి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉద్యనవన అధికారి సురేంద్రనాథ్, దుద్యాల్ ఏఈవో భావన, ఫామాయిల్ ఫీల్డ్ ఆఫీసర్ మహేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.